# ఆసరాతో ఆర్థిక అడుగులు

ఆసరా పథకంతో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధులను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేస్తారు. ఈ నిధులు ద్వాక్రా గ్రూపుల ఖాతాలకు జమ అవుతాయి. గ్రూపు ఖాతాల నుంచి వ్యక్తిగత ఖాతాలకు ద్వాక్రా సమావేశం, తీర్మానం అనంతరం బదిలీ జరుగుతుంది. ఈమేరకు దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 53,350 మంది మహిళలు, 5,432 గ్రూపులకు రూ.53 కోట్ల 63 లక్షల మేర లబ్ధి చేకూరనుంది.

– దెందులూరు

## మహిళలకు వరం



వైఎస్సార్ ఆసరా పథకం మహిళకు వరం. మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఎగువ స్థితికి చేరుకుని ఉన్నతంగా కుటుంబమంతా జీవించాలన్న సీఎం దూరదృష్టి, ప్రణాళిక అక్కాచెల్లెమ్మలందరికీ వరంగా మారింది.

– పులిపాటి శ్యామలాదేవి, లబ్ధిదారురాలు

## తండ్రి బాటలోనే తనయుడు



తండ్రి వైఎస్సార్ బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారు. మాట ఇచ్చిన విధంగానే అన్ని రకాలుగా సంక్షేమ పథకాలతో మహిళలను ఆదుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల ఆర్థిక స్థితి మెరుగుపర్చుకునేందుకు చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది.

– ఆనందదాసు నాగమల్లిక, లబ్ధిదారురాలు, పెదవేగి

## రుణపడి ఉంటాం



మహిళలకు పెద్దన్నలా, కుటుంబంలో వ్యక్తిలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలబడుతున్నారు. ఆసరా పథకంలో నిధులు విడుదల ద్వారా పొదుపు సంఘాల మహిళలందరినీ ఆదుకున్నారు. సీఎం జగన్‌కు మహిళలందరూ రుణపడి ఉంటారు.

– లక్ష్మి, లబ్ధిదారురాలు, చాటపర్రు

## పేదల పెన్నిధి



దివంగత డాక్టర్ వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధిగా మహిళల సంరక్షకుడిగా చరిత్రలో నిలిచి పోతారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి పథకాలు కేటాయించడం సంతోషంగా ఉంది.

– వాసాల సుజాత, లబ్ధిదారురాలు, రామచంద్రపురం

## సీఎంకు కృతజ్ఞతలు



నవరత్నాల పథకాల్లో డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నగదు పంపిణీ వేదిక దెందులూరు కావడం అక్కాచెల్లెమ్మలతో పాటు నాకూ సంతోషంగా ఉంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న వైఎస్సార్ ఆసరా పథకం బటన్ నొక్కి మహిళలకు నిధులు బదలాయింపుతో పాటు దాదాపు రూ.500 కోట్ల అభివృద్ధి పనులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభం కానున్నాయి. దెందులూరు నియోజకవర్గంపై సీఎంకు ఉన్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే , దెందులూరు

## మహిళా పక్షపాతి



తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగానే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి అయిన వెంటనే వైఎస్సార్ ఆసరా పథకం రూపొందించారు. ఇప్పటికే రెండు విడతలు అక్కచెల్లెమ్మలకు నిధులు విడుదల చేశారు. మహిళలందరి తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– గంటా పద్మశ్రీ ప్రసాద్, జెడ్పీటీసీ, పెదపాడు

## పాటెమ్మతల్లికి జలాభిషేకం



108 కలశాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న దృశ్యం

దెందులూరు : చల్లచింతలపూడి – పెరుగుగూడెం గ్రామాల మధ్య కొలువై ఉన్న పాటెమ్మ తల్లి అమ్మవారికి గురువారం 108 కలశాలు సమర్పించి, 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. యలమర్తి వారి ఆడపడుచు శ్రీపాటెమ్మతల్లికి పెరుగుగూడెం గ్రామం నుంచి ముత్తైదువులు, దేవస్థానం కమిటీ చైర్మన్, పెరుగుగూడెం మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాస్, హేమలత, వందలాది మంది భక్తులతో మేళతాళాల నడుమ ఆలయానికి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమ సారే బోనాలను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం జలాభిషేకం నిర్వహించారు. రెండు గ్రామాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో పాటెమ్మతల్లి ట్రస్టు డైరెక్టర్లు యలమర్తి మురళీ, రాంబాబు, బురయ్య, ముమ్మడి మోహన్ రావు, పర్వతనేని ప్రభాకరరావు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ముగిసిన దేవేరుల శోభాయాత్ర



దెందులూరు 9వ వార్డు సెంటరులో శోభాయాత్రకు హాజరైన భక్తజనసందోహం

దెందులూరు : దెందులూరులో శ్రీ రామదండు ఆధ్వర్యంలో నిర్వహించిన నవ దేవ దేవేరుల శోభాయాత్ర ముగిసింది. గ్రామంలోని 9 దేవ్వక్ష విగ్రహాలను రథాలపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ 9వ వార్డు సెంటర్, లైబ్రరీ సెంటర్, బస్టాండ్ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన వేదికల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

### ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



చల్లాలమ్మ ఆలయం వద్ద కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

ఉంగుటూరు: గ్రామ దేవత చల్లాలమ్మ సంబరాల సందర్భంగా గురువారం ఆలయం వద్ద అడపా శోభరాణి నేతృత్వంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. అలాగే ఉదయం నుంచి అమ్మవారికి ప్రతిరూపాలైన గరగలతో ఆసాదు ఇంటింటికీ వెళ్తున్నారు. కమ్మవారి వీధి, శివాలయం పేట, బీసీ కాలనీ ప్రాంతాల్లో ఇంటికి వచ్చిన చల్లాలమ్మను మహిళలు కాళ్లకు నీళ్లు పోసి ఆరాధించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీరెడ్డి శ్రీనివాసరావు, ఆలయ ఈఓ కలగర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### రాష్ట్ర పోటీలకు పత్తేపురం విద్యార్థినుల ప్రాజెక్ట్



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, గ్రామ పెద్దలు

నిడమర్రు: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం పోటీల్లో పత్తేపురం చింతలపాటి మూర్తిరాజు జెడ్పీ స్కూల్ విద్యార్థినుల ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ హెచ్‌ఎం టీవీ రామకృష్ణ తెలిపారు. జిల్లా పోటీల్లో రెండు ప్రాజెక్టులు మాత్రమే ఎంపిక కాగా వీటిలో పత్తేపురం విద్యార్థులు తయారుచేసిన చిరుధాన్యాల ఆహార పదార్థాల వినియోగం అనే ప్రాజెక్ట్ ఉందన్నారు. గురువారం పాఠశాలల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులతోపాటు, ఆ ప్రాజెక్ట్ గైడ్ టీచర్ కుచ్చెర్లపాటి సుబ్బరాజును పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

### ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



బొమ్మిడి సొసైటీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ బుజ్జిబాబు

ఉంగుటూరు: స్థానిక గ్రోమోర్ షాప్, బొమ్మిడి సొసైటీ ఎరువుల విక్రయాల లైసెన్సులను వ్యవసాయ విజిలెన్స్ అధికారులు సస్పెండ్ చేశారు. వ్యవసాయశాఖ కోటరామచంద్రపురం ఏడీ ఏపీ బుజ్జిబాబు గురువారం మండలంలోని ఉంగుటూరు, నారాయణపురం, బొమ్మిడి, కొత్తగూడెం కైకరం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను, సొసైటీలను ఎరువుల స్టాకును తనిఖీలు చేశారు. రూ.18 లక్షల విలువైన 183 టన్నులు ఎరువులు విక్రయాల నిలుపుదలకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ బాలిన వెంకటేష్ పాల్గొన్నారు.

### శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 50,112 విరాళంగా అందజేశారు. ఆకివీడుకు చెందిన చేబోయిన నాగశివకృష్ణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ మెట్లపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కామిరెడ్డి నాని

దెందులూరు : ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం సభకు హాజరయ్యే లబ్ధిదారులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలందించాలన్నారు. ఫలహారాలు, తాగునీరు అందివడంలో ఆలస్యం లేకుండా చూడాలన్నారు. ఆయా వార్డు, గ్రామ వలంటీర్లు, సీఏలు, గ్రామ సంఘాల నాయకులు, సీసీలు, ఉద్యోగులు తమ సేవలందించాలన్నారు. సమావేశంలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు : సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పెదపాడు నందు ఖాళీగా ఉన్న మినీ కార్యకర్త, సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెదపాడు సీడీపీఓ కె.విజయలక్ష్మి తెలిపారు. పెదవేగి మండలంలోని కూచింపూడి -2 ఓపెన్ పీహెచ్ కేటగిరీ, కొండలరావుపాలెం ఎస్టీ, రాట్నాలకుంట-2 బీసీ-డీ, పెదపాడు మండలంలోని శౌరిపురం ఎస్సీ, కొనికి ఓసీ, ఏలూరు మండలంలోని శ్రీపర్రు -1 ఓసీ కేటగిరీలకు కేటాయించినట్లు తెలిపారు. పెదవేగి మండలంలోని ప్రకాష్ నగర్‌లోని అంగన్‌వాడీ మిని సహాయకురాల పోస్టు ఓసీ జనరల్ అభ్యర్థులకు కేటాయించారన్నారు. స్థానికులై ఉండి, 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న 10వ తరగతి పాసైన వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 31 తేదీ సాయంత్రం 5గంటల లోగా పెదపాడు లోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

### భీమడోలులో..

భీమడోలు: భీమడోలు మాతాశిశు సంక్షేమ శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఆరు అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళలను నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమడోలు ఐసీడీఎస్ పీఓ కేవీ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు భీమడోలులో గురువారం ఆమె ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసారు. ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడెంలో బీసీసీ, దెందులూరు మండలం దోసపాడులో ఓసీ, ఉంగుటూరు మండలం బాదంపూడిలో ఎస్టీ, నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో బీసీబీ, దేవరగోపవరంలో ఓసీ, గుణపర్రులో ఎస్సీ మహిళలకు కేటాయించినట్లు పీవో తెలిపారు. స్థానిక వివాహిత మహిళ అయ్యి ఉండాలని, 21 ఏళ్ల నిండి 35 సంవత్సరాల లోపు ఉండాని, కనీస విద్యార్హత పదో తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా భీమడోలు పీఓ కార్యాలయంలో నేరుగా దరఖాస్తులను అందజేయాలని ఆమె కోరారు.

## దళితులపై దాడులు దుర్మార్గం



వినతి పత్రం అందజేస్తున్న దళిత నేతలు

పెదవేగి : కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన దళితుడు నడిపల్లి రాము హత్యను పెదవేగి మండలంలోని దళిత నాయకులు తీవ్రంగా ఖండించారు. దోషులను వెంటనే శిక్షించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధితుడు కుటుంబాన్ని ఆదుకోవాలని, దాడికి కారకులపై, దాడిని ప్రోత్సహించిన వారిని వెంటనే శిక్షించాలన్నారు. ఎస్సీ పల్లెల్లో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దళితులపై దాడులు దుర్మార్గం అని, దోషులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యర్రా నాగమల్లేశ్వరరావు, మద్దుల స్వామిదాసు, కొల్లూరి రామకృష్ణ, దోమతోటి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల తనిఖీ



గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి

పెదపాడు : పాఠశాలలో వసతులు మెరుగుపర్చాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. వట్లూరులోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి పురుషోత్త కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి గురువారం సందర్శించారు. విద్యార్థులతో ఆమె మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్టల్ పరిశుభ్రతపై, ఆహార పదార్థాల నాణ్యతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరీ దెబ్బతిన్నదని, దీంతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని వీటిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆమె తెలిపారు.

## ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

భీమడోలు: దేవాలయాల పురోభివృద్ధికి ఉత్తమ సేవలందిస్తున్న ఇద్దరికి ఉగాది పురస్కారాలు వరించాయి. మండల పరిధిలోని దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని భీమడోలు శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి కమిటి నిర్వాహకుడు సుతాపల్లి ప్రసాద్, గుండుగొలనులోని శ్రీసీతారామస్వామి వారి ఆలయ అనువంశిక ధర్మకర్త కొండ గంగారాజ్‌కుమార్‌లు ఉగాది పురస్కారాలను అందుకున్నారు. తాడేపల్లిగూడెంలో బుధవారం ఉగాది సందర్భంగా దేవదాయధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ ఎం.విజయరాజుచేతుల మీదుగా ఉత్తమ సేవలందించిన వారిని సత్కరించారు. వారికి దుశ్శాలువాను కప్పి జ్ఞాపికను అందించి ధృవీకరణ పత్రాన్ని అందించి సన్మానించారు.

## తహసీల్దార్‌కు వినతి

గణపవరం: దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీడబ్ల్యూజే పిలుపు మేరకు గురువారం గణపవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సభ్యుడు తన్నీడి పుల్లారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.హరిశ్రీ మన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు : తోటగూడెం గ్రామ సచివాలయం పరిధిలోని రాజుపేటలో వలంటీరు (జనరల్) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. అదే గ్రామానికి చెందిన 10వ తరగతి పాసైన అభ్యర్థులు ఈనెల 26 సాయంత్రం 5గంటల లోపు ఏపీ వలంటీరు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 27న దరఖాస్తుల పరిశీలన, 28న ఇంటర్వ్యూలు నిర్వహించి, 29న ఎంపికైన అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు.

## మహిళపై దాడి

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో స్థలం సరిహద్దు విషయంలో ఏర్పడిన వివాదంలో ఓ వివాహిత మహిళపై ముగ్గురు మహిళలు దాడి చేసి గాయపర్చారు. బాధితురాలు దేవదాసి జ్యోతిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు భీమడోలు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎంఎంపురంకు చెందిన దేవదాసి జ్యోతికి, కొండపల్లి దేవమాతకు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 19న సరిహద్దు స్థలం విషయంలో వారిద్దరికి మధ్య గొడవ జరిగింది. దీంతో దేవదాసి జ్యోతిపై కొండపల్లి దేవమాత, ఆమె చెల్లెలు నిర్మల, అత్త కొండపల్లి నిర్మల దాడి చేసి గాయపర్చారు. గాయపడిన దేవదాసి జ్యోతి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

## వాటికన్ రాయబారి గెరెల్లికి సత్కారం



వాటికన్ రాయబారి లియో ఫోర్డ్ గెరెల్లిని సత్కరిస్తున్న బిషప్ జయరావు, ఇతర గురువులు

పెదవేగి : రోమన్ కెథలిక్ ద్వారా దేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి దంత వైద్య కళాశాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల అని వాటికన్ రాయబారి లియో ఫోర్డ్ గెరెల్లి అన్నారు. గురువారం పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలకు విచ్చేసిన గెరెల్లికి కళాశాల యాజమాన్యం అధ్యాపకులు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. గెరెల్లి, ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు, ఏలూరు పీఠం వికార్ జనరల్ పి.బాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురువులకు కన్య స్త్రీలకు పూలమాలలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గెరెల్లి మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారి రోమన్ కెథలిక్ ద్వారా ఏర్పాటుచేసిన ఈ కళాశాలలో విద్యార్థులు మంచి క్రమశిక్షణతో నడుచుకుంటారన్నారు. ఇక్కడి విద్యార్థులు మంచి వైద్యులుగా తయారవుతున్నారని, ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని కొనియాడారు. ఈ సంస్థ నడుపుతున్న బిషప్ జయరావును, కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్‌ని అభినందించారు. అనంతరం కళాశాలలో వాటికన్ రాయబారి లియోఫోర్డ్ గెరెల్లిని అన్ని విభాగాల సిబ్బంది, ఫాదర్‌లు ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

## సారాయి, మద్యం సీసాల ధ్వంసం



నాటుసారా, మద్యంను ధ్వంసం చేస్తున్న సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం, ఎస్సై సుబ్బారావు

భీమడోలు: భీమడోలు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాటు సారాయి, అక్రమ మద్యం సీసాలను గురువారం భీమడోలులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యవర్తుల సమక్షంలో వాటిని దగ్ధం చేశారు. ఎస్ఈబీ డెప్యూటీ కమీషనర్ అమర్‌బాబు ఆదేశాల మేరకు భీమడోలు సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్సై సుబ్బారావు, సిబ్బంది సమక్షంలో గతేడాది 2022లో పట్టుబడిన నాటుసారాయి 684.1 లీటర్లు, డ్యూటీ పెయిడ్ మద్యం 493.18 మిల్లీ లీటర్లు, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు 31లను మధ్యవర్తులైన వీఆర్వోలు వెజ్జు వినయ్‌కుమార్, గంథం మార్కేండేయులు సమక్షంలో వాటిని ధ్వంసం చేశారు. అదే విధంగా వివిధ కేసుల్లో పట్టుబడిన 9 వాహనాలకు వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భీమడోలు ఎస్ఈబీ పరిధిలో అక్రమంగా నాటు సారాయి, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లో వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

## వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



కొయ్యలగూడెం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : వర్జీనియా పొగాకు కొనుగోళ్లు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయి. వేలం నిర్వహణాధికారి ఎం.గ్రేస్ మార్గరెట్ ఆధ్వర్యంలో పొగాకు అమ్మకాలు నిర్వహించారు. అంకాలగూడెం క్లస్టర్ కు చెందిన 36 బేళ్ల విక్రయానికి ఉంచగా అన్ని బేళ్లు కేజీ రూ.210కు వివిధ కంపెనీలు వేలంలో దక్కించుకున్నాయి. వేలం అనంతరం గ్రేస్ మార్గరెట్ మాట్లాడుతూ ఈ సంవత్సరం బోర్డు వారి ప్రాథమిక అంచనాల ప్రకారం కొయ్యలగూడెం వేలం కేంద్రం పరిధిలో గల పొగాకు రైతులు పన్నెండున్నర మిలియన్ల కేజీల పొగాకు పంటను ఉత్పత్తి చేశారన్నారు. ఇది అనుమతించిన దాని కన్నా రెండున్నర మిలియన్ల కేజీలు ఎక్కువన్నారు. ప్రస్తుత సీజన్లో బేరన్ పొగాకు ఉత్పత్తికి రూ.లక్షా 80 వేలు అదనపు ఖర్చు అయిందని ఈ నేపథ్యంలో గత సంవత్సరం వచ్చిన సరాసరి కంటే 20 శాతం సగటు పెరుగుదల ఉండేలా చూడాలని రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. రైతు నాయకులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, అల్లూరి రాంబాబు, అడపా సత్తిబాబు, సైదులు, కాకర్ల శేషు, మద్యాహ్నపు యేసు, గెడా సత్తిబాబు, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : అకాల వర్షాల కారణంగా జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కె.గంగాధర్ మాట్లాడుతూ అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న, పొగాకు, పుచ్చ, జీడీమామిడి, మామిడి పంటలను పరిశీలించి పంట నష్టపరిహారం చెల్లించే విధంగా అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, రైతులు ఈడా వీర్రాజు, కొప్పుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి



గణపవరం డిగ్రీ కాలేజీలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్



నిడమర్రులో భగత్‌సింగ్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నేతలు

ఉంగుటూరు: భరతమాత ముద్దు బిడ్డ భగత్ సింగ్, యుటీఎఫ్ ఉద్యమ నిర్మాత అప్పారి వెంకటస్వామి అడుగుజాడల్లో మనమంతా నడవాలని ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో భగత్‌సింగ్, వెంకటస్వామిల వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు పునుముల రాంబాబు, రవికుమార్, నర్సింహరావు, శీతాల సత్యనారాయణ, దాకి జోగినాయుడు పాల్గొన్నారు.

### భగత్‌సింగ్ త్యాగం మరువలేనిది

గణపవరం:దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన భగత్‌సింగ్ త్యాగాన్ని ఈదేశం ఎన్నటికీ మరువదని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి అన్నారు. గురువారం కాలేజీలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగత్ సింగ్ సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, అధ్యాపకులు స్వరూపరాణి, డీపీవీ చిన సత్యనారాయణ, వెంకట్రావు పాల్గొన్నారు.

### నిడమర్రులో..

నిడమర్రు: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు అన్నారు. గురువారం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల 92 వర్ధంతి సందర్భంగా నిడమర్రు గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల నేతలు భగత్ సింగ్ ఫ్లెక్సీపకి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, కంచం వరప్రసాద్, లవేటి చంద్రరావు, మింది బాపిరాజు, పిల్లా సూరిబాబు తదితరులున్నారు.